క్లుప్తంగా

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నర్మద



మద్దూరు: అంగడ్‌రాయిచూర్‌కి చెందిన నర్మదను బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ.. బీఎస్పీ అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నియామక పత్రం అందజేసినట్లు ఆమె బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా పనిచేస్తూ.. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని పేర్కొన్నారు.

ఆరోగ్య నిలయాలుగా తీర్చిదిద్దాలి



దామరగిద్ద: అంగన్‌వాడీ కేంద్రాలను చిన్నారుల ఆరోగ్య నిలయాలుగా తీర్చిదిద్దాలని సర్పంచ్ విశాలాక్షి, ఐసీడీఎస్ దామరగిద్ద సూపర్‌వైజర్ రూప అన్నారు. బుధవారం మండలంలోని ఉడ్మల్‌గిద్ద గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చిన్నారుల ఎదుగుదలకు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కేంద్రాల్లో అందించే ఆహారంతో పాటు చిన్నారులకు ఇంటి వద్ద అందించాల్సిన పౌష్టికాహారం, ఆటపాటలతో చిన్నారుల మానసిక ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రథమ్ సూపర్‌వైజర్ కవిత, అంగన్‌వాడీ టీచర్లు రాధమ్మ, మహాలక్ష్మి చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



మద్దూరు: అంగన్‌వాడీలో చేరిన చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీపీ విజయలక్ష్మి, సర్పంచ్ అరుణ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని 7 అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులతో బాలల మేళా నిర్వహించారు. ఈ మేళాలో చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కేంద్రాల్లో వారి ఎదుగుదల, పౌష్టికాహారం అందించడం, క్రీడలు, తదితర అంశాలు పిల్లలపై చాలా ప్రభావం చూపుతాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, పద్మ, అంగన్‌వాడీ టీచర్లు సుగుణ, భాగ్యమ్మ, విజయలక్ష్మి, సిద్ధమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూర్: మండలంలోని నిడుగుర్తి, పగిడిమారి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ప్రీ స్కూల్ మేళా నిర్వహించారు. చిన్నారులు ఉపాధ్యాయుల వేషధారణలో అంగన్‌వాడీ కేంద్రానికి హాజరై పలువురిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సులోచన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ మేళా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నిడుగుర్తి సర్పంచ్ యశోద, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, రేణుక, అనురాధ, జ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి



మరికల్: మండల కేంద్రంలో బీఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం ఆ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ మాట్లాడారు. రాబోవు ఎన్నికల్లో తప్పకుండా బహుజనుల రాజ్యం అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో చెన్నయ్య, వెంకటయ్య, రాజు, రవియాదవ్, అరవింద్, అశోక్, శ్రీను పాల్గొన్నారు.

ఎస్సీ ధ్రువీకరణ పత్రం ఇవ్వొద్దు

ఆత్మకూర్: మాదాసి, మాదారి కుర్వలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకూడదని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మాదాసి కుర్వ తెగకు సంబంధించిన 520 కుటుంబాలు మాత్రమే ఉన్నాయన్నారు. ఆర్థికంగా బలంగా ఉన్న గొల్ల, కురుమలు కూడా తాము మాదాసి కుర్వలమని చెప్పుకుంటూ రాజకీయం చేస్తున్నారని, తప్పుడు మార్గాలను ఎంచుకుని నిజమైన దళితులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. మాదాసి కుర్వలు లేరని ఎట్టి పరిస్థితిల్లోనూ వారికి ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకూడదని తహసీల్దార్ సింధూజకు వినతిపత్రం అందజేశారు. కిషోర్, బాలమణ్యం, లింగన్న, జానకీరాములు, సోంబాబు, అనిల్, దావీదు, అశోక్, నవీన్, దేవ, శివ, రాము, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

అల్లుకున్న ప్రమాదం

- విద్యుత్ స్తంభాలకు పాకిన తీగజాతి మొక్కలు
- ప్రమాదవశాత్తు మంటలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి పక్కన

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పలు కాలనీల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. స్తంభాలకు తీగజాతి మొక్కలు పాకి తీవ్ర ఇబ్బందులు కల్గిస్తున్నాయని ఆయా కాలనీ ప్రజలు వాపోతున్నారు. అయితే వర్షాకాలంలో పెరిగిన తీగజాతి మొక్కలు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. తీగలు ఒకదానికి ఒకటి తగిలి మంటలు చెలరేగుతున్నాయి. స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పెరిగిన మొక్కలు,



సివిల్‌లైన్‌లో అల్లుకున్న తీగజాతి మొక్క

పొదలను అధికారులు తొలగించకపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వాపోతున్నారు. స్తంభాలకు కేవలం చెట్లు అడ్డొస్తే చెట్లనే తొలగిస్తున్నారని, తీగజాతి మొక్కలను తొలగించడంలో విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడెక్కడ..

జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తా రోడ్, యాద్గీర్ రోడ్, సివిల్‌లైన్, శాతావాహన కాలనీ, గాంధీనగర్, శ్యాసన్‌పల్లి రోడ్, సత్యసాయికాలనీ, అశోక్‌నగర్, బీసీ కాలనీల్లో తీగ జాతి మొక్కలు స్తంభాలకు ఏపుగా పెరిగిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలకు పాకి ఎండిపోయిన తీగజాతి మొక్కలను తొలిగించకపోవడంతో కొన్ని చోట్ల వీధి లైట్లు వెలుతురు కూడా కనపడని పరిస్థితి నెలకొందని, వెంటనే వాటిని సరిచేసి వెలుతురు వచ్చేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తీగజాతి మొక్కలను తొలగిస్తాం..

> కొన్ని చోట్ల చెట్లను తొలగించాం. మరికొన్ని చోట్ల తీగజాతి మొక్కలు స్తంభాలకు ఎండిపోయాయి. వాటిని తొలగించి విద్యుత్ అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం. త్వరలోనే తొలగించి సమస్య పరిష్కరిస్తాం.
>
> – మహ్మద్ రఫీ, విద్యుత్ శాఖ పట్టణ ఏఈ, నారాయణపేట



పల్ల వీధిలో..

అసైన్డ్ పట్టాల పంపిణీపై విచారణ



వివరాలు సేకరిస్తున్న అధికారులు

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తిలో ఇటీవల రైతులు అసైన్డ్ పట్టాభూముల పట్టాలకు దరఖాస్తు చేసుకోగా.. కలెక్టర్, మండల రెవెన్యూ ఆదేశాలతో ఆర్‌ఐ రాజు, మరో ఎనిమిది మంది సిబ్బంది బుధవారం పంచనామా నిర్వహించారు. 80 మంది రైతుల్లో 75 మంది రైతుల పంచనామా రిపోర్టును సిద్ధం చేసినట్లు చెప్పారు. ఓ మహిళ రైతు వేలి ముద్ర పడకపోవడంతో పెండింగ్‌లో ఉందని, మిగిలిని నలుగురు రైతులు గైర్హాజరైనట్లు తెలియజేశారు. విరాసత్ కోసం దరఖాస్తు చేస్తున్న 64 మంది రైతుల వివరాలను పరిశీలించాల్సి ఉందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, రైతుబంధు సమితి కన్వీనర్ భీంరెడ్డి, మాజీ సర్పంచ్ బసిరెడ్డి పాల్గొన్నారు.

కొండాపూర్ శివారులో పులి సంచారం



ధన్వాడ: మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులోని ఎస్టీ గురుకుల పాఠశాల వద్ద బుధవారం సాయంత్రం పులి కనిపించింది. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. పది రోజుల కిందట ఇక్కడే పులి కనిపించడంతో ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించగా.. వారు వచ్చి పరిశీలించి వెళ్లిపోయారు. తిరిగి బుధవారం మళ్లీ పులి కనిపించడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. గట్టు పక్కనే పాఠశాల ఉండటం, పాఠశాలకు కాంపౌండ్ లేకపోవడంతో విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ రాజరాం ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

మాగనూర్: ప్రజలు బ్యాంకులపై అవగాహన కలిగి ఉండాలని మాగనూర్ ఏపీజీవీబీ మేనేజర్ సుమన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్‌బ్యాంకు వద్ద ఖాతాదారులకు, ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు బ్యాంకుపై అవగాహన కల్పించి బ్యాంకుల ద్వారా కలిగే లాభాలను వివరించారు. దేశంలోని ప్రజలందరూ బీమా చేసుకోవాలంటే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సురక్ష మిత్ర, జీవన జ్యోతి, అటల్ బీమా పెన్షన్ యోజన, రూపే కార్డులు వంటివి నమోదు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా రైతులు



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు మేనేజర్ సుమన్

బ్యాంక్ నుంచి తీసుకున్న పంట రుణాలు సకాలంలో పునరుద్ధరించుకుంటే కలిగే లాభాలను వివరించారు. ఎఫ్‌ఎల్‌సీ సురేష్, కళాకారుల బృందం తదితరులు పాల్గొన్నారు.

నందిగామ రూట్‌లో బస్సు ప్రారంభం



మద్దూరు: కొత్తపల్లి మండలంలోని నందిగామ, తిమ్మారెడ్డిపల్లి రూట్‌లో మహబూబ్‌నగర్ డిపోనకు చెందిన బస్సును బుధవారం ఆర్టీసీ అధికారులు ప్రారంభించారు. ఈ గ్రామాలకు బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని ఈ గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు ఆర్‌ఎంకు విన్నవించుకున్నారు. ఈ నెల 3న ఈ డిపోకు చెందిన రూట్ అధికారి రాంజీ సర్వే చేసుకుని వెళ్లారు. మహబూబ్‌నగర్ నుంచి నందిగామ, తిమ్మారెడ్డిపల్లి మీదుగా మద్దూరు నుంచి కర్ణాటక రాష్ట్రంలోని యానగుందే వరకు ఈ బస్సును నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం బస్సు నడుస్తుందన్నారు. బస్సు రావడంతో నందిగామకి చెందిన సర్పంచ్ సత్యమ్మ, గ్రామస్తులు బస్సుకు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యం

కోస్గి: రూ.కోట్ల అప్పులు చేస్తూ.. అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమ పాలనలో పూర్తిగా విఫలమయ్యాయని టీపీసీసీ సభ్యులు వార్ల విజయ్‌కుమార్ ఆరోపించారు. ప్రజా సంక్షేమ పాలన కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన 'హాథ్ సే హాథ్ జోడో యాత్ర' బుధవారం మండల పరిధిలోని మీర్జాపూర్‌లో కొనసాగింది. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రకు మద్దతుగా మండల పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘువర్ధన్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పట్టణ



మీర్జాపూర్‌లో కాంగ్రెస్ నాయకుల యాత్ర

అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, కౌన్సిలర్లు గోవర్ధన్‌రెడ్డి, ఇద్రీస్, భానునాయక్, సీనియర్ నాయకులు శివరాజ నాగులపల్లి నరేందర్, సలీం, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ధన్వాడ సంతబజార్ ప్రాథమిక పాఠశాలలో..



మాగనూర్‌లో..

ధన్వాడ: మండల కేంద్రంలోని సంతబజార్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. హెచ్‌ఎంగా నవీన్,



మరికల్‌లో...

ఎంఈఓగా భరద్వాజ్, డీఈఓగా అభిలాష్, కలెక్టర్‌గా అక్షరాతో పాటు 29 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.

మాగనూర్: మండల కేంద్రంలోని మార్గదర్శి విద్యాలయంలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించుకున్నారు. కలెక్టర్‌గా స్వాతి, అడిషనల్ కలెక్టర్‌గా మమత, డీఈఓగా నవీన్ వ్యవహరించారు.

మరికల్: మండల కేంద్రంలోని ప్రతిభ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం ఘనంగా స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. 85 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు.

కొనసాగుతున్న కంటివెలుగు



మక్తల్: మండలంలోని గొల్లపల్లిలో గురువారం కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 100 మందికి కంటి చికిత్స చేశారు. కంటి అద్దాలు, ఉచిత మందులను ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, సర్పంచ్ పెద్దలక్ష్మి చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ విరోజ, అభినాష్, సులోచనమ్మ, లక్ష్మి, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమ్మపల్లిలో..

మాగనూర్: కంటి వెలుగు రెండో దశ కార్యక్రమం బుధవారం మండల పరిధిలోని అమ్మపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ పద్మమ్మ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పద్మమ్మ మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యశిబిరాల వద్ద కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి వైద్య బృందానికి కంటి పరీక్షల నిర్వహణకు అవసరమైన వైద్య పరికరాలు, మందులు అందుబాటులో ఉంచామని వెల్లడించారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలి

అమరచింత: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో సిట్‌తో కాకుండా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్ చేశారు. సిట్ రాష్ట్ర ప్రభుత్వ పంజరంలో చిలక అని, వాస్తవాలు బయటికి రావని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రభుత్వం ఏళ్ల తరబడి ఉద్యోగ భర్తీలు చేయకుండా ఎన్నికల సమయంలో నోటిఫికేషన్లు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఉద్యోగాల భర్తీ చేతకాదని, ప్రశ్నాపత్రాల లీకేజీలు అంటూ కాలయాపన చేయడానికే కుట్రలు పన్నిందన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

దామరగిద్ద: ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం మండలంలోని దామరగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరంలో మొత్తం 206గురు విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 198 మంది పరీక్షలకు హాజరయ్యారు. 8 మంది గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం అధికారి ప్రేమ్ సాగర్ తెలియజేశారు.

కేంద్రాన్ని పర్యవేక్షించిన కన్వీనర్

పరీక్ష కేంద్రాన్ని ఇంటర్ పరీక్ష కేంద్రాల కన్వీనర్, డీఈసీ మెంబర్ సుధాకర్‌రావు ఆకస్మికంగా పర్యవేక్షించారు. ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు పాల్పడవద్దని, పకడ్బందీగా పరీక్షలు కొనసాగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఎస్ ప్రేమ్‌సాగర్, డీఓ రజక్ ఆయన వెంట ఉన్నారు.

మాగనూర్‌లో..

మాగనూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు సీఎస్ రేణుకదేవి తెలిపారు. మొదటి రోజు విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాశారని తెలిపారు. కళాశాలలో మొత్తం మొదటి రోజు 150 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా.. 142 మంది పరీక్ష రాశారు. 8 మంది గైర్హాజరయ్యారు. నిమిషం ఆలస్యం నిబంధన ఉండటంతో విద్యార్థులు గంట ముందుగానే చేరుకున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ మోడల్ పాఠశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 185 మంది విద్యార్థులకు గాను 183 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. అలాగే తెలంగాణ మోడల్ పాఠశాలలో 179 మంది విద్యార్థులకు గాను 172 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. తహసీల్దార్ నాగలక్ష్మి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.



మాగనూర్‌లో రూం నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

ఊట్కూర్: ఇంటర్ ఒకేషనల్ 39 మంది, ఇంటర్ కళాశాల విద్యార్థులు 136 మందికి గాను 129 మంది హాజరయ్యారు. ఏడుగురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్ అంబాజీ, డిపార్ట్‌మెంటల్ అధికారి ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు. ఎస్‌ఐ రాములు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

మద్దూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 232 మంది విద్యార్థులకు గాను 221 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలేటి తెలిపారు. ఈ సెంటర్‌ను డీఈసీ మెంబర్లు సుదర్శన్‌రావ్, ప్రతాప్‌రెడ్డి పరిశీలించారు.



ధన్వాడలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగలక్ష్మి

వేడుకగా బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన



కోస్గి బీసీ కాలనీలో యజ్ఞంలో పాల్గొన్న భక్తులు



నారాయణపేటలో మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

కోస్గి: పట్టణంలోని తెలుగు వీధి, బీసీ కాలనీల్లో నిర్వహిస్తున్న శ్రీనాభి శిలా(బొడ్రాయి) విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమ మహోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభించారు. ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఈ నెల 17 వరకు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. మొదటి రోజు బుధవారం గణపతి గౌరీ పూజ, గోపూజ, అఖండ దీపారాధన, యాగశాల ప్రవేశం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మంగళహారతి కార్యక్రమంతో పాటు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో బొడ్రాయిని మహిళలు మంగళహారతులతో ఊరేగించారు. తెలుగు వీధి నిర్వాహకులు నిర్వహించిన ర్యాలీలో అడుగుల భజన కార్యక్రమం ప్రత్యేకంగా నిలిచింది. అనంతరం తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పోలమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని పరిమళాపురంలో వెలిసిన పోలమ్మ ఆలయం పునర్నిర్మాణం చేసి, ఆలయ అభివృద్ధికి కమిటీ నిర్ణయించినట్లు ఆలయ కమిటీ సభ్యులు ప్రభాకర్‌వర్ధన్, శ్రీపాద్ కులకర్ణి పేర్కొన్నారు. బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణం పనులు త్వరగా, చేపట్టి వచ్చే, ఆషాఢ మాసం బోనాల పండుగ వరకు పనులు పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించినట్లు తెలియజేశారు. ఆలయ అభివృద్ధికి పట్టణ ప్రజలు, భక్తులు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో బండిశివరాంరెడ్డి, సరాఫ్‌నాగరాజ్, రాము, గోపాల్, సాయిలు, బోయలక్ష్మణ్, నీలిరవి, సాయిలు, పాండు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉంచాలి

నారాయణపేట రూరల్: మత్తు పదార్థాలకు దూరంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామని ఏఎస్‌ఐ ఆంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక పీఎస్ ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తుపదార్థాలు తీసుకోవడంతో కలిగే అనర్థాలను వివరించారు. అదేవిధంగా సైబర్ నేరాల వలలో పడే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహన డ్రైవింగ్ సమయంలో హెల్మెట్, సీట్‌బెల్టు ధరించాలన్నారు. విపత్తు నివారణ చట్టం అమలులో ఉన్నందున నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.వెయ్యి జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందన్నారు. నిత్యం యోగా, మెడిటేషన్, వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు కతలప్ప, సంతోష్, హన్మంతు, కృష్ణ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ ఆంజనేయులు

సీఐటీయూ వర్క్‌షాప్‌లో జిల్లా నాయకులు

నారాయణపేట టౌన్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించిన సీఐటీయూ వర్క్‌షాప్‌లో నారాయణపేట జిల్లా నుంచి జిల్లా కన్వీనర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని కార్మికుల స్థితిగతులు వివరించారు. కార్మిక సమస్యలపై జిల్లాలో చేస్తున్న పోరాటాలను వివరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్‌తో పాటు 33 జిల్లా సీఐటీయే ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న బాల్‌రాం

రహదారి పనుల ప్రారంభం ఎప్పుడో..?

నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్ నుంచి బెక్కర్‌పల్లి వరకు బీటీ రహదారి పనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. రహదారి నిర్మాణ కోసం ఇటీవల రూ.90 లక్షలు మంజూరైన నేపథ్యంలో పనులు వెంటనే ప్రారంభించాలని వారు కోరుతున్నారు. రహదారి పూర్తిగా దెబ్బతిని వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. నిత్యం అమరచింత, ఆత్మకూర్‌కు ఈ రహదారి వెంట ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు, ఆటోలో ప్రయాణికులు వెళ్తుంటారు. ప్రస్తుతం రోడ్డు అడుగడుగున గోతులు పడడంతో ఇబ్బందులు పడుతూ ప్రయాణిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే రహదారి పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.